# కథ

# ఆనంద నిలయం

మాదిరాజు నిర్మల

ప్రభాకర్ ఇంటి నుండి వచ్చానేగానీ నా మన సంతా ప్రభాకర్, రఘురాం చుట్టూనే తిరుగుతోంది. సర్వం కోల్పోయిన వాడిలా ఇంట్లోకి అడుగుపెట్టగానే నాకు సౌమ్య ఎదురయ్యింది.

నన్ను చూసి కొంచెం కంగారుగా "ఏంటలా ఉన్నారు మామయ్యగారూ, ఒంట్లో బాగుండలేదా?" అని అడిగింది.

'బాగానే ఉన్నాను' అన్నట్లు తలూపి డాబా మీదకు వెళ్లిపోయాను. ఈ చీకటిని చూస్తుంటే రఘు, ప్రభుల జీవితాలు ఇలాగే ఉన్నాయనిపిస్తుంది. నా పక్కనే ఎవరో వచ్చి నిలుచున్న అలికిడికి ప్రక్కకు తిరిగి చూశాను. సుశీల నా చేతికి మృదువుగా ఒత్తుతూ-

"ఏం జరిగిందండీ? మీరు రావడం నేను చూడలేదు, సౌమ్య వచ్చి, 'అత్తయ్యా, మామయ్యగారు ఎందుకో డల్‌గా ఉన్నారు, డాబామీదకు వెళ్లారు. మీరూ కాసేపు మామయ్యగారి దగ్గర ఉండండి' అనేటప్పటికి నేను వచ్చాను" అన్నది సుశీల.

"సుశీ, కొంచెం కాఫీ..." నా మాట పూర్తి కాకుం డానే సౌమ్య రెండు గ్లాసులతో కాఫీ తీసుకువచ్చి మా ఇద్దరికీ ఇచ్చి వెళ్లిపోయింది.

అనుక్షణం మా ఆలోచనలకు తగ్గట్టుగా నడుచుకునే మా కోడలిని చూస్తుంటే మేమెంత అదృష్టవంతులం అని పించింది. కాఫీ త్రాగుతూ రఘు, ప్రభుల గురించి చెప్పాను. "సుశీ, ప్రతి ఇంట్లో ఉండే గొడవలే వాళ్లిం ట్లోనూ ఉన్నాయనుకున్నానే కానీ వీళ్లు ఓల్డేజ్ హోంలో చేర్పించి చేతులు దులుపుకోవాలనుకుంటున్నారని అను కోలేదు. వాళ్ల పిల్లలు ఎంతో తెలివి గలవారనుకున్నానే గానీ తల్లిదండ్రుల్ని గెంటేసేంత తెలివిగలవారనుకో లేదు. ఈ వయసులో మాకు భగవంతుడు ఇలాంటి గతి పట్టించాడన్నయ్యా అంటూ తులసి, వర్ధని ఏడుస్తుంటే నేను తట్టుకోలేకపోయాను. నేను ఏమీ చెప్పలేకపో యాను. ఒక స్నేహితుడిగా వాళ్లకు నేనేమీ చెయ్యలేకపో తున్నందుకు ఇన్నేళ్ల మా స్నేహానికి అర్థమే లేదనిపి స్తుంది. నలభై ఏళ్ల నుంచి మనమంతా ఒకేచోట ఉంటున్నాం. ఎవరికీ ఏ కష్టమొచ్చినా ఒకరికొకరం ఆదుకున్నాం. పరాయివాళ్ల మధ్యనున్న అనుబంధం కన్నపిల్లలకు లేకపోయింది" నా గొంతు జీరబోయింది.

"డబ్బు ముందు ఎలాంటి బంధాలూ ఉండకుండా పోతున్నాయి. ఎవరినీ ఏమీ అనుకునేందుకు లేదు" నిర్లి ప్తంగా అంది సుశీల.

"అదికాదు సుశీ, మన వంశీ, మధూలు, వాళ్ల పిల్లలు అంతా ఒకే ఈడువారు. మన పిల్లల కన్నా కూడా వాళ్లు ఎంతో గారాబంగా పెరిగారు. ఈ రోజు మన పిల్లల మధ్య ఎంత ప్రశాంతంగా బ్రతుకుతున్నాం. మన పిల్లలే కాదు బయట నుంచి వచ్చిన కోడలు, అల్లుడు కూడా మనతో ఎంత అభిమానంగా ఉంటారు! చిరా కులూ, పరాకులు ఒక్క నాడు కూడా మన ఇంట్లో నేను చూడలేదు"

"అంతా మంచివాళ్లయితే ఇక అనుకునేది ఏముంది?" అంది సుశీ. మెట్ల దగ్గర చప్పుడు వినిపించి, ఇద్దరం అటు చూశాము. వంశీ వస్తూ కనిపించాడు.

"మంచు పడుతోంది క్రిందకు రండమ్మా" అన్నాడు వంశీ.

ఇద్దరం క్రిందకు దిగాం.

★★★

నేను చిన్నతనం నుండీ బాధ్యతల బరువును మోసిన వాడిని. నాకున్న గవర్నమెంటు ఉద్యోగం అప్పులపాలు కాకుండా బ్రతకడానికి పనికి వచ్చింది. నా భార్య సుశీల కూడా నాకు ఎంతో సహకరించేది. ఒక్కొక్కసారి అను కుంటాను 'మగాడికయినా, ఆడదానికయినా సరయిన జీవన సహచరి ఉంటే బ్రతుకుబాటలో ఎన్ని అవాంత రాలు వచ్చినా వాళ్ల జీవితం ఒడిదుడుకులు లేకుండా గడచిపోతుంది కదా' అని. నా సెక్షన్‌లోనే పనిచేసే ప్రభా కర్, రఘురాం, నాకు మధ్య స్నేహం బాగా బలపడింది. మేమంతా కలసి ఒకరి ఇళ్లకు ఒకరం వెళ్లటం, భోజ నాలు చెయ్యడం... ఒకే కుటుంబ సభ్యులుగా ఉండే వాళ్లం.

ప్రభాకర్, రఘూ-నీ భార్యని మా చెల్లెలు అను కుంటే మాకెంతో గర్వంగా ఉంటుందిరా, మా భార్యలూ అప్పుడప్పుడు, అన్నయ్యగారు ఈయన ఇలా తయారయ్యారేంటి? అని నీకు ఏదో ఒకటి చెప్తూనే ఉంటారు. కానీ చెల్లాయి మాత్రం సరదాగా కూడా నిన్ను ఏమీ అనదు. మేము అనమన్నా కూడా సరదాగా కూడా ఆయన గురించి అబద్ధం ఆడటం నాకు ఇష్టం ఉండదు అన్నయ్యా అంటుంది అనేవాళ్లు.

ప్రభాకర్‌కు ఒక్కడే కొడుకు కార్తీక్. రఘురామ్‌కు ఇద్దరు కూతుళ్లు. మంజుల, స్మిత. నాకు ఒక కొడుకు వంశీ, కూతురు మధు. నేను మొదటి నుంచీ మధు గురించి భయపడేవాణ్ని. అది ప్రతి దానికీ పేచీలు పెట్టేది. దానికి కొన్న బొమ్మల కంటే వంశీకి కొన్న బొమ్మలే నచ్చేవి. బట్టల విషయంలోనూ అంతే. ప్రతిదీ వంశీకి పోటీగా వచ్చేది. వంశీ పేచీ పెట్టడు గానీ బిక్క మొహం పెట్టుకొనేవాడు. దాని ధోరణి చూశాక ఏద యినా కొనాలనుకున్నప్పుడు వంశీని, మధును పిలిచి, "వంశీకి ఇది కొనాలనుకుంటున్నాను, నీకు ఏం కొన మంటావు?" అని చాయిస్ దానికే వదిలేవాణ్ని. తినేవి అయితే ఒకసారి మధూకి ఇష్టమైనవి తెచ్చే వాణ్ని. ఇంకోసారి వంశీకి ఇష్టమైనవి తెచ్చే వాణ్ని. మధు చలా కీతనం కొండల మీంచి ఉరికే జలపాతాన్ని గుర్తుకు తెస్తే, వంశీ గాంభీర్యం నిండుగా ఉండే నదిని గుర్తుకు తెస్తుంది. నేను ఎప్పుడయినా మధూ గురించి బాధ పడ్తే సుశీ...

"మీరు పిల్లల గురించి ఎందుకంత ఆలోచిస్తారు, మధు చిన్న పిల్ల. దానికి ఆడ మగ భేదం తెలియదు. వంశీ మగవాడు కాబట్టి వాడు ఒక రకంగా ఉంటాడు. నేను ఆడపిల్లను కాబట్టి ఇలా ఉండాలి అని ఆలోచించే వయసు దానికి లేదు. పెద్దయితే అదే తెలుసుకుం టుంది" అన్నది. సుశీ మాట అక్షరాలా నిజమని నిరూ పించింది మధు.

★★★

వంశీ, కార్తీక్, మంజుల, స్మిత ఇంజనీర్లయ్యారు. మధు లెక్చరర్‌గా స్థిరపడింది. మధును కూడా ఇంజనీ రింగ్ చదివిద్దామనుకున్నాను. కానీ అది ఒప్పుకోలేదు. అది ఎందుకు వద్దనుకుంటుందో నాకు తెలుసు. గుండె దుఃఖంతో బరువెక్కింది. "ఏమ్మా నీకు చెప్పించలేనని వద్దనుకుంటున్నావా?" అన్నాను.

వంశీ కూడా "మధూ నీకు మంచి ర్యాంకు వచ్చింది. నాన్నకు ఇబ్బంది లేకుండా ఏదయినా పార్ట్‌టైం జాబ్ చేస్తాను" అన్నాడు.

మధు చిన్నగా నవ్వి "అన్నయ్యా, నాన్న చెప్పించలే రని నేను వద్దనటం లేదు. నాకే ఇంట్రెస్ట్ లేదు" అన్నది.

"అది కాదమ్మా..." ఏదో చెప్పబోతున్న నన్ను మధ్య లోనే ఆపి "నాన్నా తెలివితేటలు ఉన్నాయంటే డాక్టరో, ఇంజనీరో అవ్వాలా? నేను నా జీవితాన్ని ప్రశాంతంగా గడపగలగాలి. పెద్ద పెద్ద ఉద్యోగాలు చేసి నా వాళ్లకు నేను కరెన్సీ కట్టలు అందించగలనేకానీ 'ప్రేమ'ను అందించగలనా? వాళ్ల ప్రేమను పొందగలనా? నేను ప్రతీ విషయానికీ అన్నయ్యతో పోటీ పడ్డానంటే మీరు చూపించే ఆడ, మగ అన్న భేద భావం మా ఇద్దరి మధ్యా దూరాలను పెంచకూడదని, ఈ రోజు దేనికీ నోరు విప్పని వాడు నన్ను చదువుకోమంటున్నాడంటే నా మన స్సును అర్థం చేసుకోబట్టి" అన్నది మధు.

నేను వంశీ వంక చూశాను. వంశీ ఏమీ అనలేదు గానీ మధు చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. అందు లోనే అనేక భావాలు వ్యక్తమయ్యాయి నాకు. నా మనస్సు ఎంతో సంతృప్తి చెందింది. కన్నవాళ్లను పట్టిం చుకోని ఈ రోజుల్లో నా పిల్లలు పొరపచ్చాలు లేకుండా

ఉండటం... కేవలం నా అదృష్టం అను కున్నాను.

★ ★ ★

ప్రభాకర్ కొడుకు కార్తీక్, రఘురాం కూతురు మంజుల పెళ్లి చేసు కోవాలనుకున్నారు. స్నేహం బంధు త్వంగా మారబోతున్నందుకు అందరం ఎంతో ఆనందించాం. స్మితకు బయట సంబంధం చూసి ఇద్దరి పెళ్లిళ్లూ ఒకే సారి చేశారు. మధుకు సంబంధాలు చూడమని 'సుశీ' పోరు మొదలెట్టింది. నేనూ ప్రయత్నాలు ప్రారంభించాను. ఒక రోజు అందరం భోజనాలు చేస్తున్న ప్పుడు మధు తన కోలెక్చరర్ మనోహ ర్‌ని పెళ్లి చేసుకోవాలనుకుంటుంది అని వంశీ చెప్పాడు. నేను ఆశ్చర్యంగా మధు వంక చూశాను. మధు తల వంచుకొని తింటున్న అన్నాన్ని మధ్యలోనే వదిలే సింది.

"అతనిది మన కులం కాదు" అన్నాడు వంశీ.

నేను 'సుశీ' వంక చూశాను.

సుశీ కళ్లల్లో కలవరపాటు.

"నాన్నా, మనోహర్‌ని, వాళ్ల పేరెంట్స్‌ని ఒక్కసారి మన ఇంటికి పిలుద్దాం. ఒక్కసారి వాళ్లతో మాట్లా డితే..." బిడియంగా ఆగిపోయాడు వంశీ.

"సరే రేపు సండే వాళ్లను మన ఇంటికి ఆహ్వా నిద్దాం" అన్నాను కంచంలో చెయ్యి కడుగుతూ.

ఇద్దరి మొహాలు వెలిగిపోయాయి. ఆదివారం అందరం మా ఇంట్లో సమావేశమయ్యాం. ముందు కొంచెం ఇబ్బందిగా అనిపించినా అందరం బానే కలసి పోయాం. మనోహర్ నాకు సుశీకు బాగా నచ్చాడు.

అంతకంటే నాకు మధు, మనోహర్ పెళ్లి గురించి చెప్పిన అభిప్రాయాలు బాగా నచ్చింది.

"పెళ్లి అనేది ఇద్దరి వ్యక్తుల జీవితం కాదు. రెండు కుటుంబాలు పరస్పర ప్రేమానురాగాలతో పెనవేసు కునే బంధం. మీరు మా మనస్తత్వాలకు తగ్గవాళ్లను మా జీవన సహచరులుగా తీసుకువస్తామంటే మేము మా ఇద్దరికీ రాసి పెట్టలేదని మా జీవన గమ్యాలను మార్చుకుంటాం. అంతేకానీ మా జీవితం మా ఇష్టం అనుకునేంత సంకుచిత మనస్తత్వాలు మాకు లేవు" అన్నారు. వంశీ కూడా మధునే సమర్థించాడు. నిర్ణ యాన్ని మాత్రం మనోహర్ పేరెంట్స్‌కే వదిలాం. ఎందు కంటే మధు ఉండవలసింది ఇక అక్కడే కాబట్టి. వాళ్లకీ మధు నచ్చింది. రఘు, ప్రభులు కూడా మనోహర్‌ని చూసి, మధు సెలక్షన్ బాగుందని తెగ మెచ్చుకున్నారు.

చెల్లెలి తరఫున వకాల్తా పుచ్చుకున్న వంశీ మీద నాకు కొంచెం అనుమానం వచ్చింది. "ఏరా నువ్వు కూడా..."

"నో, నో... నాకు ఎవరితోనూ పరి చయాలే లేవు" గాభరా పడ్డాడు వంశీ. మధు తన కాలేజీలోని ఇంకో లెక్చరర్ సౌమ్యను వంశీకి సజెస్ట్ చేసింది.

'సౌమ్య' పేరుకు తగ్గట్టు గానే ఉంది. ఆమె అమాయక మైన మొహం చూస్తుంటే 'ఈ పిల్ల కాలేజీలో పాఠాలు ఎలా చెప్తుందా!' అని ఆశ్చర్యమే స్తుంది. ఒకే ముహూర్తాన ఇద్దరి పెళ్లిళ్లు చేశాము.

సౌమ్య మా ఇంటికి రావడం, మధు అత్తగారింటికి వెళ్లడం జరిగాయి. ఎప్పుడ యినా నేను, సుశీల మధును చూడటానికి వెళ్తే మధు అత్త, మామగార్లు మధు గురించి మాట్లాడేటప్పుడు 'మా అమ్మాయి' అని అంటారే గానీ, 'మీ అమ్మాయి' అనరు. ఇంతకన్నా ఆడపిల్లను కన్నతల్లి దండ్రులకు కావల్సింది ఏముంది?

★ ★ ★


రిటైరైతే చాలామంది జీవితంలో స్వేచ్ఛను కోల్పో యినట్లుగా ఫీలవుతారు. రఘు, ప్రభు కూడా అలానే ఫీలవుతుంటే నాకు ఆశ్చర్యమనిపించింది. కానీ నాకు రిటైర్‌మెంట్ దేవుడిచ్చిన వరంగా భావిస్తాను. సుశీలతో ఎక్కువ సేపు టైం స్పెండ్ చెయ్యగలుగుతున్నాను. మా సంసారనౌకలో మరో ఇద్దరు వచ్చి చేరారు. సౌమ్య బాబుకు, మధు పాపకు జన్మనిచ్చారు. బాబుకు 'ఆనంద్' అని పేరు పెట్టాం. పాపకు చిన్నతనం లోనే చనిపోయిన మనోహర్ చెల్లెలు స్నేహ పేరు పెట్టుకున్నారు. మధు పిల్లలిద్దరినీ ఒళ్లో పెట్టు కొని ఆడిస్తున్నప్పుడు, స్నేహం లోనే ఆనందం ఉంటుంది. కాబట్టి నా కూతుర్ని నీ కొడుక్కి చేసు కోండి. అప్పుడే ఆనంద్‌గాడు ఆనందంగా ఉంటాడు" అనేది వంశీ, సౌమ్యలతో.


"నాన్నకు కోడలిని వెతికే బాధ తప్పించి నట్లు నాక్కూడా కోడలిని వెతికిపెట్టే బాధ తప్పి స్తావంటే అంతకన్నానా" అనేవాడు వంశీ.

"అత్తయ్యగారి కన్నా నేనే అదృష్టవంతు రాల్ని. నాకు ఇప్పటి నుంచే పనులు చేసిపెట్టే వియ్యపురాలు వస్తోంది" అనేది సౌమ్య. అందరం నవ్వుకునే వాళ్లం.

★ ★ ★

నా జీవితం నా మనవడి ఆటపాటలతో ఆనం దంగా సాగు తున్న వేళ నా స్నేహితులు రఘు, ప్రభు చెప్పిన మాట నీటిలో రాయి విసిరితే ఏర్పడిన అలల్లా నా మనస్సులో దుఃఖిత రంగాలు ఏర్పడినాయి. వాళ్ల పిల్లలు చెప్పేది ఒక్కటే. "మీరు పెద్దవారయ్యారు. ఏ క్షణంలో పోతారో ఎవ్వరూ చెప్పలేరు. ఆస్తి పంపకాలు చేసి 'ఓల్డేజ్ హోం'లో చేరండి. ఇక్కడుంటే మేము చూడమని కాదు. మీ గురించి పట్టించుకునే తీరిక మాకు ఉండదు. ఆశ్ర మంలో అయితే డాక్టర్ల చెకప్‌ల దగ్గర నుండీ అన్ని సదు పాయాలు ఉంటాయి."






ఆ మాటలు నాకే గునపంతో పొడిచినంత బాధగా ఉంటే వాళ్లు ఎంత వేదన అనుభవిస్తున్నారో కదా! సుశీల కూడా చాలా బాధపడుతోంది. సొంత అన్నయ్యలుగానే భావించింది వాళ్లను. పైకి తను మామూలుగా ఉండేందుకు ప్రయత్నిస్తోంది కానీ నేను మాత్రం ఉండలేకపోతున్నాను. కళ్లు మూసినా తెరచినా వాళ్లు దీనంగా నాకు కనిపిస్తున్నారు. వాళ్లిద్దరు పోయినా నేనింత బాధ పడేవాణ్ని కాను. ఎప్పుడో ఒక రోజు నేనూ అంతేగా అనుకునే వాణ్ని. కానీ బ్రతికి ఉండగానే ఆ రకంగా దూరమవుతోంటే ఒక స్నేహితుడిగా నేనేమీ చేయలేకపోతున్నాననే బాధ భరించలేకపోతున్నాను.

★ ★ ★

ఒకరోజు మధు, మనోహర్ అతని అమ్మానాన్నలు, సౌమ్య అమ్మా నాన్నలు వచ్చారు. పిల్లల గురించి ఏమీ అనిపించలేదు కానీ పెద్దవాళ్ల రాక నాకు ఎంతో ఆశ్చర్యమేసింది. సుశీల వంక చూశాను. తనకేమీ తెలియదన్నట్లు చూసింది. సౌమ్య అందరికీ కాఫీలు ఇచ్చి వంట పని చూసుకోవడానికి వంటగదిలోకి వెళ్లింది. మధు, సౌమ్యను లాక్కొచ్చింది. "హోటల్ నుంచి పార్శిల్స్ వస్తాయి. ఈ పూటకు వంట చేయక్కర్లేదంటూ"

సుశీల ఆశ్చర్యంగా "అదేంటీ హోటల్ నుంచి ఎందుకు? ఎంతసేపు వంట చెయ్యడం?" అంది.

"ఎంతసేపు అని కాదమ్మా, ఒక 'శుభవార్త' గురించి మాట్లాడడానికి మేమంతా వస్తే తను ఒక్కతే వంటగదిలో ఎందుకు?" అంది మధు.



"ఏమిటా శుభవార్త!" అన్నట్లు వంశీ వంక చూశాను.

"ఆదివారం మీ బర్త్‌డే, ఆ రోజు మీకు షష్టిపూర్తి చేయాలనుకుంటున్నాం" అన్నాడు వంశీ.

నేను ఉలిక్కిపడ్డాను.

నేనున్న పరిస్థితులలో ఆ మాటలు నాకు కొంచెం కోపం తెప్పించాయి. నా స్నేహితులను గేలి చేస్తున్నట్లు నేను షష్టిపూర్తి చేసుకోవాలా! నా మనస్సు చదివినట్లుగా, "ఇది అంకుల్ వాళ్ల కోరిక. వాళ్లు వెళ్లిపోయేలోగా ఒకరోజు మనందరితో సంతోషంగా గడపాలని ఉందని, మిమ్మల్ని ఒప్పించమన్నారు నాన్నా" అంది మధు. సౌమ్య అమ్మా నాన్నా, మధు అత్తామామగార్లు బలవంతంగా నన్ను ఒప్పించారు. నేను ఎవ్వరినీ పిలవద్దన్నాను. వంశీ కూడా. "మన ముగ్గురి ఫామిలీ మెంబర్సేను, ఎవ్వరినీ పిలవం" అన్నాడు.

★ ★ ★

ఆదివారం ఉదయం 7 గంటలకు ముహూర్తం. శనివారం రాత్రికే ప్రభాకర్ దంపతులు, రఘురాం దంపతులు, సౌమ్య అమ్మా, నాన్న, మధు అత్తామామగార్లు వచ్చేశారు. ఇల్లు నిజంగా పెళ్లివారిల్లుగానే ఉంది. ప్రభు, రఘులతో మాట్లాడదామని నా మనసు తహతహలాడుతున్నా మనోహరో, వంశీనో వాళ్లు నా దగ్గరకు రానీయకుండా చేస్తున్నారు. తెల్లవారింది. మా ఇద్దరికీ మంగళస్నానాలు చేయించారు. ప్రభాకర్, రఘు నన్ను పెళ్లికొడుకుగా అలంకరిస్తే, తులసి, వర్ధనీలు సుశీలని పెళ్లికూతుర్ని చేశారు.

నా స్నేహితుల సమక్షం ఆనందంగా అనిపించినా కొద్ది రోజులలో వీరు దూరమవుతున్నారన్న బాధ కలుగుతోంది. నా ఆలోచనలలో నేనుండగానే అన్ని ముచ్చట్లూ జరిగాయి. "చదివింపుల కార్యక్రమం మొదలుపెడ్దామా" అన్న బ్రాహ్మణుని మాటలకు స్పృహలోకి వచ్చాను.

"అలాంటి తతంగాలేవీ వద్దండి" అన్నాను.

"మేము ఏమీ తేలేదులెండి నాన్నగారూ, మీకు బట్టలుపెట్టి మీ ఆశీర్వాదాలు తీసుకుందామని" అంతే అంది మధు.

సౌమ్య అమ్మానాన్న, మధు అత్తామామ మా ఇద్దరికీ బట్టలు పెట్టారు. ప్రభు, రఘు నాకు, సుశీలకి ఉంగరం, గొలుసు పెట్టారు. అవి వాళ్లు ఉద్యోగంలో చేరిన కొత్తల్లో కొద్దికొద్దిగా దాచుకున్న డబ్బుతో కొనుక్కున్నవి. ఎన్ని ఇబ్బందులు వచ్చినా వాటిని ఎప్పుడూ తాకట్టు పెట్టలేదు. అలాంటిది... అవి తిరిగి ఇచ్చేయబోయాను. కానీ వాళ్లు తీసుకోలేదు.

"నీకు గిఫ్ట్‌గా కొనలేక కాదురా, ఇవి నీ దగ్గరుంటే మేమెక్కడ ఉన్నా నీ దగ్గరే ఉంటున్నట్లు ఫీలవుతాం" అని వారించారు. నేనూ తర్కించలేదు. మనోహర్, మధు, సౌమ్య, వంశీ వచ్చారు. మా చేతికి అక్షింతలు ఇచ్చి ఆశీర్వదించమని మా పాదాలకు నమస్కరించారు.

తర్వాత వంశీ, "నాన్నా, నేనూ, మధు, మనోహర్, సౌమ్య నలుగురం కలసి ఎంతో ఆలోచించి ఒక నిర్ణయం తీసుకున్నాం. మా నిర్ణయం మీకు ఆనందాన్ని కలిగిస్తుందనే అనుకుంటున్నాం. ఇంతకీ మేమివ్వబోయే మీ 'పెళ్లి కానుక' 'ఇదుగో' అంటూ ప్రభు, రఘుల చేతులను నా చేతులలో పెట్టాడు. నేను, ప్రభాకర్, రఘురాం వంశీ మాటలు అర్థం కాక అలాగే చూస్తున్నాం. వంశీ, ప్రభాకర్ వాళ్లతో, "అంకుల్ మీ ఇద్దరినీ మాకు ఊహ తెలిసినప్పటి నుంచీ చూస్తున్నాం. మా అమ్మావాళ్లతో పాటే మీరూ మా జీవితాల్లో ఒక భాగం అనుకున్నాం. మీరు 'ఓల్డేజ్ హోం'లో చేరుతున్నారంటే మొదట్లో బాధపడ్డాం. ఈ సమస్యకి పరిష్కారం ఏమిటా అని ఆలోచించాం. చివరకి మాకు ఒక ఆలోచన వచ్చింది. ఎక్కడో తెలియని వ్యక్తుల మధ్య మీరు ఉండే కంటే మీరంతా ఒక్కచోటే కలిసి ఉంటేనే బాగుంటుందనిపించింది. స్నేహం అంటే కలసి హోటల్స్‌కి వెళ్లి టిఫిన్ చెయ్యడం, సినిమాలకు వెళ్లడం కాదు. కష్ట సుఖాలను కలసి జీవితాంతం పంచుకోవడమే నిజమైన స్నేహానికి నిర్వచనం. మీ స్నేహము అలాంటిదే కావాలి. మీ స్నేహితులు ఎప్పుడూ విడిపోకూడదు. కలసి జీవించాలి నవ్వుతూ, అందరినీ నవ్విస్తూ... మన ఇంటినే 'ఓల్డేజ్ హోం'గా మారుస్తున్నాం" అన్నాడు.

వంశీ అన్న మాటలకు మాకు అర్థమయ్యేసరికి మా మొహాలు ఆనందంతో వెలిగిపోయాయి. "నేనూ, సౌమ్య క్రింది పోర్షన్‌లో ఉంటాం. పై పోర్షన్‌లో మీరంతా ఉండండి" అన్నాడు వంశీ.

"ఇంతకీ మన హోం పేరేమిటి" అడిగింది తులసి.

మేమంతా కుతూహలంగా చూస్తున్నాం. ఆనంద్‌ను ఎత్తుకొని ముద్దు పెట్టుకుంటూ "ఆనంద నిలయం" అన్నది మధు.

"ఈ ఇంట్లో ఆనందానికి తప్ప విచారానికి తావుండకూడదు" అన్న మధు మాటలు నా మనసుకు కలిగిన గాయానికి మందులా పనిచేసింది.

○

## ముంబయ్‌కి మారిన అశిన్

ప్రస్తుతం 'గజినీ' హిందీ వెర్షన్‌లో ఆమీర్ ఖాన్‌తో నటిస్తున్న అశిన్ 'ఢిల్లీ 6' అనే సినిమాలో కూడా ఎన్నికైంది. అలాగే 'పోకిరి' హిందీ వెర్షన్ హీరోయిన్‌గానూ సెలక్ట్ అయినందున అశిన్ తన మకాంని ముంబాయ్‌కి మార్చిందిట. త్వరలోనే ఓ ఇంగ్లీషు సినిమాలో కూడా నటించే చాన్సుంది అని చెబుతున్న అశిన్ నేనెక్కడ వున్నా, ఏ భాషలో నటించినా నాకేం పెద్ద కంగారుగా అనిపించదు అంటోంది.